క్లుప్తంగా

సుబ్బలక్ష్మమ్మకు భూమన నివాళి



నివాళులర్పిస్తున్న కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ మాతృమూర్తి సుబ్బలక్ష్మమ్మ శుక్రవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి వెంటనే సామంచి శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆయన తల్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం సామంచి శ్రీనివాస్, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గ్యాస్ ఫైర్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాకాల : మండలంలోని స్నామ్ ఫ్యాక్టరీలో శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బందికి గ్యాస్ ఫైర్స్‌పై అవగాహన కల్పించారు. ఫ్యాక్టరీలో గ్యాస్ ఫైర్స్ ఎలా సంభవిస్తాయి, ఎలా నివారించాలి తదితర అంశాలను ఎస్ఎఫ్ఓ గుణశేఖర్‌రెడ్డి వివరించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకుని సురక్షితంగా కార్మికులు బయటపడాలో తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బాలాజీ, ఆరోన్, పాయని, రాజేంద్రబాబు, నాగార్జున, నరేంద్ర, శ్రీనివాసులు, సురేంద్ర పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు కార్యాలయం



విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ మోహన్ తదితరులు

తిరుపతి రూరల్ : మండలంలోని పెరుమాళ్లపల్లెలో విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ జోగి మోహన్, టీడీపీ నేతలు దివాకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి చేతుల మీదుగా కార్యాలయ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వారు పలువురు రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

నెన్నూరులో పశు వైద్య శిబిరం



క్యాంపును ప్రారంభిస్తున్న వైద్యులు

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలం నెన్నూరులో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం ప్రారంభించారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇంటర్న్‌షిప్ విద్యార్థులు ఏడు రోజులపాటు పశువులకు వైద్య సేవలు అందించనున్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, వైకుంఠరావు, పశు వైద్య అధికారి జయకిషోర్, డీఏహెచ్ డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఉమామహేశ్వర్, చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ అనసూయమ్మ, ఎంపీటీసీ సభ్యులు జ్ఞానమ్మ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు 'ఈ-వేస్ట్'

తిరుపతి తుడా : నగరంలోని ప్రతి ఒక్కరూ ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వస్తువులు)ను రాయల్ నగర్‌లోని ఆర్ఆర్ఆర్ సెంటర్‌లో అందించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రామ్‌లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ-వేస్ట్ నిర్వహణ, సేకరణపై నగరవాసులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ-వేస్ట్‌ను నగరంలోని న్యూ బాలాజీ కాలనీలో ఉన్న అన్నా క్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్ వద్ద ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామని వివరించారు. వినియోగించని ఎలక్ట్రికల్ వస్తువులు, కంప్యూటర్లు, బ్యాటరీలు, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రికల్ ఫోన్ తదితర వస్తువులను సెంటర్‌లో ఇవ్వవచ్చని చెప్పారు. దీనిపై శనివారం ఉదయం 8 గంటలకు పాత మునిసిపల్ కార్యాలయం నుంచి శ్రీదేవి కాంప్లెక్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు.



● ఆరాధన.. ఆత్మ నివేదన

క్రీస్తును స్మరించుకుంటూ తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో క్రైస్తవులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. అందులో భాగంగా తిరుపతిలోని వెస్ట్ చర్చి, ఈస్ట్ చర్చి, జగన్మాత చర్చి, షెకీనా ప్రార్థనా మందిరాలలో క్రీస్తును కీర్తిస్తూ పాస్టర్లు సందేశాలు వినిపించారు. యేసు క్రీస్తు శిలువ మరణం పొందిన విధానం వివరించారు. షెకీనా చర్చిలో సీనియర్ పాస్టర్ అరుల్ అరసు పాస్టర్ జోయల్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు చేశారు. మానవాళి పాప విమోచన కోసం కల్వరి పాస్టర్ అరుల్ అరసు మాట్లాడుతూ.. క్రీస్తు చూపిన ప్రేమ, క్షమాపణ, కనికరం, దయ, జాలి మహోన్నతమైనవని, అందరూ క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో నడవాలని సందేశమిచ్చారు. క్రైస్తవులుస్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పాకాలలోని సీఎస్ చర్చిలో పాస్టర్ ప్రేమ్‌కుమార్, సీఎస్ఐ చర్చిలో ఫాదర్ ఆంథోనిరాజ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేపట్టారు.అన్నదానం చేశారు.

– తిరుపతి కల్చరల్/పాకాల



షెకీనా ప్రార్థనా మందిరంలో ప్రసంగిస్తున్న పాస్టర్ అరుల్ అరసు



తిరుపతిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



యేసు ప్రభువు వద్ద ప్రార్థనలు చేస్తున్న మహిళలు



పాకాలలో ప్రత్యేక ప్రార్థన

సహజం.. సఫలం!

నోరూరించే పండ్లు.. చూడగానే కొనాలనిపిస్తుంది.. వెంటనే తినాలనిపిస్తుంది. కనువిందుగా కనిపించే అమృతఫలాలు సైతం విషతుల్యంగా మారిపోతున్నాయి. మధురమైన రుచితోపాటు రసాయనాలను శరీరానికి చేరవేస్తున్నాయి. ఆకట్టుకునే రంగు కోసం పలువురు వ్యాపారులు కృత్రిమ విధానాలు పాటించడం వల్లే దుష్పరిణామాలు తలెత్తుతున్నాయి. సహజ పద్ధతుల్లో పండ్లను మగ్గబెడితేనే సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఈ క్రమంలో కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. కెమికల్స్ వాడని ఫ్రూట్స్‌నే భుజించాలని కోరుతున్నారు.

– తిరుపతి మంగళం



- రసాయనాలతో మగ్గిస్తే విషతుల్యం
- మార్కెట్‌లో యథేచ్ఛగా కృత్రిమ విధానాల వినియోగం
- కెమికల్స్ వాడకంతో పండ్లు విషతుల్యం
- భుజించిన వారికి తప్పదు అనారోగ్యం
- ఫ్రూట్స్ కొనుగోలులో అప్రమత్తం

వేసవి సీజన్ వచ్చిందో లేదో అప్పుడే మార్కెట్‌లోకి మామిడి పండ్లు వచ్చేశాయి. అలాగే వాటర్ మిలన్, మరోవైపు ద్రాక్ష, ఆల్ సీజనల్ ఫేవరెట్ అరటి ఇలా అన్ని రకాల పండ్లు వీధివీధిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే ఆరోగ్యం కోసం ఇష్టంగా కొనుగోలు చేసే పండ్లతో ప్రమాదకర రసాయనాలు కూడా మన ఇంట్లోకి ప్రవేశిస్తున్నాయి. ప్రధానంగా ఈ సీజన్‌లో మాత్రమే దొరికే మామిడి పండ్లు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను తీసుకొచ్చే ప్రమాదముంది. ఈ తరుణంలో అసలు మంచి పండ్లను ఎలా గుర్తించాలి అనే అంశంపై నగరవాసులు దృష్టి సారిస్తున్నారు.

గుర్తించడం ఎలా..

- సంప్రదాయ పద్ధతిలో పండిన ఫలాలు కమ్మని, తియ్యటి వాసనతో ఉంటాయి.
- ఈ పండ్లపై నల్లటి మచ్చలు కనిపిస్తాయి. ఫలాలను తెంపిన కాడ తాజాగా కాకుండా వాడిపోయినట్టు ఉంటుంది. ఈ పండ్లపై కాసింత గడ్డి పొట్టు, సన్నని బూజు కనిపిస్తాయి.
- సహజంగా మగ్గించిన వాటిని గుర్తు పట్టాలంటే ఒక బకెట్‌లో నీరు నింపి అందులో పండ్లు వేయాలి. సక్రమంగా పండించిన ఫలాలు నీటి అడుగు భాగానికి చేరుకుంటాయి. ప్రమాదకర రసాయనాలతో మగ్గించినవి మాత్రం నీటిపైకి తెలుతాయి.
- కాల్షియం కార్బైడ్ నీళ్లలో పండ్లను ఉడకబెట్టి కృత్రిమంగా మగ్గించినవి ఆకారం కోల్పోయి గుండ్రంగా మారుతాయి. అలాగే రసాయనాలతో పండించినవి తాజాగా, నిగనిగలాడుతూ కనిపిస్తాయి. ఈ ఫలాలు వాటి సహజమైన రుచిని చాలా వరకు కోల్పోతాయి.
- రసాయనాలు చల్లిన పండ్లపై ఆకుపచ్చ, బ్రౌన్ కలర్‌లో మచ్చలు ఉంటాయి.

నిషేధించినా.. వాడేస్తున్నారు!

వేసవిలో పండ్లను ఎక్కువగా భుజించడానికి ప్రజలు అధికంగా ఆసక్తి చూపుతుంటారు. ముఖ్యంగా వేసవి తాపానికి డీహైడ్రేషన్‌కు గురి కాకుండా పళ్ల రసాలను తాగుతుంటారు. దీన్ని అదునుగా కొందరు వ్యాపారులు ప్రమాదకర పంథాను ఎంచుకుంటున్నారు. సహజసిద్ధంగా పండ్లను మగ్గించడానికి బదులు కృత్రిమ పద్ధతిలో రసాయనాలను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా కాల్షియం కార్బైడ్ వంటి విషపూరిత రసాయనాలను వినియోగిస్తున్నారు. ఈ పదార్థం పలు అనారోగ్యాలకు కారణమని, దీంతో పండ్లను మగ్గించవద్దని గతంలోనే నిషేధం విధించారు. అయినప్పటికీ మార్కెట్ అవసరాల కోసం కొందరు వ్యాపారులు ఈ రసాయనాలను వాడుతూనే ఉండడం ఆందోళనకు గురిచేస్తోంది.

అనారోగ్య సమస్యలు

పండ్లు మగ్గించడానికి వినియోగించే కాల్షియం, కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాలు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ప్రజలను గురిచేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల్లో తీవ్రంగా అనారోగ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. యువతకు కూడా సమస్యలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా హృదయం, కాలేయం, కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని హెచ్చరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ రసాయనాలు ఫలాలపై తొక్కను మాత్రమే రంగులోకి తీసుకువచ్చి పండులా కనిపించేలా చేస్తాయి. దీంతో లోపల గుజ్జు పూర్తిగా పండకుండానే మార్కెట్లోకి అమ్మకానికి వస్తున్నాయి. వీటిని తింటే వాంతులు, నీరసం, చర్మ సమస్యలు, విపరీతమైన దాహం, నోటిలో పుండ్లు తదితర సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. చిన్నపిల్లలు, గర్భిణులకు ఈ పండ్లు మరింత ప్రమాదకరం. కాల్షియం కార్బైడ్ ఉత్పత్తి చేసే ఎసిటిలీన్ మానవ నాడీ వ్యవస్థను దెబ్బతీసి జ్ఞాపకశక్తి కోల్పోయేలా చేస్తుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు..



రసాయనాలతో మగ్గించి విక్రయిస్తున్న మామిడి పండ్లు

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరుబాట



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు కార్మిక వర్గాన్ని సన్నద్ధం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం గంధమనేని శివయ్య భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గాన్ని కదిలించి పోరాటాలకు సన్నద్ధం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇందు కోసం ఏఐటీయూసీ ప్రధాన భూమిక పోషించాలని ఆయన తెలిపారు. కార్మిక లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మిక వర్గం కదిలిరావాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసే బాధ్యత ఉందని, ఇందుకు ఏఐటీయూసీ సభ్యులు సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ నేతలు రాధాక్రిష్ణ, ఎన్.డీ.రవి, శ్రీరాములు, ఉదయ్‌కుమార్, సీహెచ్.శివకుమార కేవై.రాజా, ఏఐటీయూసీ సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

తిరుపతి రూరల్, (రామచంద్రాపురం): వైఎస్సార్‌సీపీ రామచంద్రాపురం మండల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు వారికి వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

మండల అధ్యక్షుడు : ఎద్దుల చంద్రశేఖర్‌రెడ్డి.
ఉపాధ్యక్షులు: లక్ష్మీనారాయణరెడ్డి, రామిరెడ్డి.
ప్రధాన కార్యదర్శులు: జి.మునీంద్రబాబు,ఎస్.చంద్రబాబు, శేషాద్రిరెడ్డి,బి.సంజీవరెడ్డి,గోపీచౌదరి.
కార్యదర్శులు: టి.మధుసూదన్ నా యుడు, టి.నరేష్, టి.చంద్రారెడ్డి, కె.శంకర్‌రెడ్డి, ఎల్.సురేంద్ర నాయుడు, పి.అశోక్.
కమిటీ సభ్యులు: బాలక్రిష్ణారెడ్డి, డి.మురళి, పి.చిరంజీవినాయుడు, పి.సుబ్రమణ్యం రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీపతి యాదవ్, ఓ.వెంకటరమణ, మనోహర్‌రెడ్డి, నాదమునిరెడ్డి

గ్రామ కమిటీ అధ్యక్షులు

అనుప్పల్లి	సి.దేవరాజులురెడ్డి
కొత్తవేపకుప్పం	సి.సుబ్రమణ్యం రెడ్డి
నెత్తకుప్పం	శశిధర్
పుల్లమనాయుడు కండ్రిగ	కేశవులురెడ్డి
ఎన్.ఆర్ కమ్మపల్లి	మురళీరెడ్డి
సీ.కె.పల్లి	కేశవులురెడ్డి
రాయలచెరువు	మధుసూదన్‌రెడ్డి
కుప్పం బాదూరు	భాస్కర్ రెడ్డి
కొత్తకండ్రిగ	చిట్టిబాబు
మిట్టకండ్రిగ	భూపతిరెడ్డి
పీవీపురం	భాస్కర్ రాయల్
గంగిరెడ్డిపల్లి	పి.భూపాల్
కమ్మకండ్రిగ	లోకనాథం
సి.రామాపురం	సి.మధుసూదన్‌రెడ్డి
నడవలూరు	గంగారామిరెడ్డి
నెన్నూరు	శ్రీకాంత్‌రెడ్డి
సొరకాయల పాళెం	జి.వినోద్
కేకేవీ పురం	జానకిరామయ్య
వెంకటరామాపురం	ఎద్దల రాజేష్
రావిళ్లవారిపల్లి	వెంకటేష్
కమ్మపల్లి	డి.బి.మహేంద్రరెడ్డి
గణేశ్వరపురం	ఎస్.పురుషోత్తమ నాయుడు

అనుబంధ విభాగాల అధ్యక్షులు

వైఎస్సార్‌సీపీ మండల యూత్ వింగ్	పుష్పకాంత్‌రెడ్డి
మహిళా విభాగం	జ్యోతి
రైతు విభాగం	మారయ్య
బీసీ సెల్	కుప్పం భాస్కర్ యాదవ్
ఎస్సీ సెల్	వెంకటేష్
ఎస్టీ సెల్	దామోదర్
మైనార్టీ సెల్	పి.రాజేంద్రప్రసాద్
క్రిస్టియన్ మైనార్టీ సెల్	మునిలక్ష్మి
స్టూడెంట్ వింగ్	యశ్వంత్‌రెడ్డి
పంచాయతీరాజ్ వింగ్	గణపతిరెడ్డి
ఆర్‌టీఐ వింగ్	కె.సుధాకర్
వలంటీర్ వింగ్	టెండుల్కర్
వాణిజ్య విభాగం	హిమాల్‌రెడ్డి
వైఎస్సార్‌టీయూసీ	ఆర్.దేవరాజులు
అంగన్‌వాడీ వింగ్	భారతి
సాంస్కృతిక విభాగం	భాస్కరయ్య
సోషల్ మీడియా వింగ్	బాదూరు రవి
దివ్యాంగుల విభాగం	కుమార్
పబ్లిసిటీ వింగ్	వజ్రవేలు



గోపురమా.. పావురమా!

నగరంలోని గోవిందరాజస్వామి ఆలయం సమీపంలో పావురాలు కనువిందు చేస్తున్నాయి. ప్రధానంగా పుష్కరిణి వద్ద నిరాలి మండపంపై సందడి చేస్తున్నాయి. ఆ ప్రాంతంలోనే నిత్యం సేదతీరుతూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

కలెక్టరేట్‌లో ఆకలి కేకలు!



- 9 నెలలుగా మూతపడిన క్యాంటిన్
- కాఫీ, టీ, భోజనానికి నానా కష్టాలు
- గ్రీవెన్స్ రోజున మరింతగా ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌కు వివిధ సమస్యలు, పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు కాఫీ, టీలకు కూడా అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో అయితే ఆకలితో అలమటిస్తున్నారు. సుమారు 9 నెలలుగా క్యాంటిన్ మూతపడడంతో కలెక్టరేట్ సిబ్బంది, అర్జీదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.


గతంలో అన్నీ అందుబాటులోనే..

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో 2022 ఏప్రిల్ 4వ తేదీన తిరుపతిలో కలెక్టరేట్ చేసినప్పటి నుంచి అందులో క్యాంటిన్ నడుస్తోంది. భోజనంతోపాటు కాఫీ, టీ, మజ్జిగ, బజ్జీలు, బోండాలు అన్నీ అందుబాటులో ఉండేది. కలెక్టరేట్‌లో 30కి పైగా విభాగాలున్నాయి. 200 మందికి పైగానే ఉద్యోగాలు పనిచేస్తున్నారు. వివిధ సమస్యలపై రోజు వందల సంఖ్యలో ప్రజలు వచ్చిపోతుంటారు. సోమవారం అయితే గ్రీవెన్స్ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించి వెయ్యి మందికి పైగానే వస్తుంటారు. సమీపంలో ఎక్కడా క్యాంటిన్ వసతి లేదు. దీంతో భోజనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఉన్న క్యాంటిన్‌నే మూత వేశారు. నెలకు రూ.30వేలు వరకు క్యాంటిన్ ద్వారా అద్దె వచ్చేది. 9 నెలల్లో 2.70లక్షల నష్టం...అంతేకాదు కలెక్టరేట్‌లోని ఉద్యోగులు, గ్రీవెన్స్ సందర్భంగా వచ్చేవారు క్యాంటిన్ లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. గతంలో తక్కువ ధరకు భోజనంతోపాటు స్నాక్స్ దొరికేవి. అందరికీ సౌకర్యంగా ఉండేది. అయితే కూటమి సర్కార్ వచ్చిన తర్వాత క్యాంటిన్ నిర్వహిస్తున్న వ్యక్తికి వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి ఖాళీ చేయించినట్లు చర్చసాగుతోంది. అదే నిజమైతే టీడీపీకి చెందిని వారికే క్యాంటిన్ కట్టబెట్టి అయినా ప్రారంభించాలని ఉద్యోగులు, ప్రజలు సూచిస్తున్నారు. ఈ దిశగా కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కలెక్టరేట్‌లో మూతపడిన క్యాంటిన్

చర్యలు చేపడతాం



కలెక్టరేట్‌లో మూతపడిన క్యాంటిన్‌ను వాడుకలోకి తీసుకువచ్చే దిశగా తప్పకుండా చర్యలు చేపడతాం. ద్యోగులతోపాటు కలెక్టరేట్‌కు వచ్చేవారికి క్యాంటిన్ అందుబాటులో ఉంటే సౌకర్యంగా ఉంటుంది. తప్పకుండా త్వరలోనే ప్రారంభించేలా కృషి చేస్తాం. – నరసింహులు, డీఆర్ఓ

అదుర్స్.. తిరువణ్ణామలై బస్సు!

- నాలుగుతో మొదలై.. 121 సర్వీసులకు చేరిన వైనం
- ఈ నెల రెండు రోజుల్లోనే రాబడి రూ.30.46 లక్షల రాబడి

తిరుపతి అర్బన్ : పౌర్ణమి రోజున తమిళనాడులోని తిరువణ్ణామలైకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ నెల 12, 13వ తేదీల్లో మొత్తం 121 బస్సులను తిరువణ్ణామలైకు నడిపింది. ఈసర్వీసులతోనే రెండు రోజులకు గాను రూ.30,46,607 రాబడి వచ్చినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు.

ప్రత్యేక సర్వీసుల ఏర్పాటుకు ఐదేళ్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తిరువణ్ణామలైకి ప్రతి పౌర్ణమికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వెళుతున్న విషయం గుర్తించారు. ఈ క్రమంలో 2020 ఏప్రిల్ 19న తిరుపతి నుంచి 4 ప్రత్యేక సర్వీసులను పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేశారు. మంచి స్పందన రావడంతో ప్రతి పౌర్ణమికి సర్వీసులను పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. 2021 ఏప్రిల్‌కు 41 సర్వీసులు, 2022 ఏప్రిల్‌కు 64 బస్సులు ఏర్పాటు చేశారు. 2023 ఏప్రిల్‌కు 86 సర్వీసులను నడిపారు. 2024 ఏప్రిల్‌కు 101 సర్వీసులను పంపించారు.2025 ఏప్రిల్‌కు 121 సర్వీసులను తిరువణ్ణామలైకు ప్రయాణికులకు అందించారు. అయితే కూటమి ప్రభుత్వంలో శ్రీకాళహస్తి, కాణిపాకం వెళ్లే బస్సులను తిరువణ్ణామలైకు కేటాయించడంపై మాత్రం విమర్శలు వినిపిస్తున్నాయి.